www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024
5
చిత్తూరు





వెదురుకుప్పం విద్యార్థిని తేజశ్రీ

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు వెదురుకుప్పం విద్యార్థిని

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఈనెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జమ్మ-కాశ్మీర్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థిని తేజశ్రీ ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తేజశ్రీని ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జనార్ధన్ యాదవ్ , రమేష్ , పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వినతులు వినవలె..!

కలెక్టర్‌కు అర్జీల వెల్లువ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారుల నుండి ఫిర్యాదులను కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు..

ప్రజా సమస్యలివే..

యాదమరి మండలం కొనాపల్లికి చెందిన జ్ఞాన సెల్వి చీలాపల్లిలో సర్వే నెంబరు 207-7, 8, 10 లో 510 చదరపు అడుగులు వ్యవసాయ భూమి వుందని, ఈ భూమి జాతీయ రహదారుల విస్తీర్ణం పనులలో భాగంగా కొంత భూమి కోల్పోయామని, అందుకు సంబంధించి నష్టపరిహారం ఇంత వరకు అందలేదని, వెంటనే అందించాలని కలెక్టర్‌కు అర్జీని సమర్పించారు. పాలసముద్రం మండలం వనదుర్గాపురం గ్రామానికి చెందిన ఎస్ మునస్వామి శెట్టి తనకు ఐదు ఎకరాల 84 సెంట్లు భూమి వుందని భూమి గత 15 ఏళ్ల తన అధీనం లో వుందని వ్యవసాయ భూమిలో 3 కొబ్బరి చెట్లు, 27 మామిడి చెట్లు వున్నాయని తను ఊరిలో లేని సమయం లో తన భూమిలో నుండి దారి వేశారని, తన సమస్యను పరిష్కరించాలని కోరారు.



ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

మొత్తం: 185 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించి 161, వ్యవసాయ శాఖ 1, పంచాయతీ రాజ్ 2, పోలీసు శాఖ 4, డిఎస్‌ఓ 2, మునిసిపల్ కమిషనర్ చిత్తూరు 2, జిల్లా విద్యా శాఖ 1, డిఆర్‌డిఎ 8, రహదారులు, భవనాల శాఖ 1, ఎంపిడిఓ కార్వేటినగరం 1, ఎంపిడిఓ వెదురుకుప్పం 1, పశు సంవర్ధక శాఖ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ, ఆర్ డిఓలకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛను మంజూరు చేయండి..



నా వయసు 74 సంవత్సరాలు.. ఇంతవరకూ నాకు పింఛను లేదు.. ప్రభుత్వం మంజూరు చేసే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయండి..

ఎం నారాయణస్వామి నాయుడు, గాజులపల్లి, చిత్తూరు మండలం.

ఆక్రమిత భూమి ఇప్పించండి..



మేళం దొడ్డి రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబరు 663, 111/6 లో 3.14 సెంట్లు భూమి నా తండ్రి పేరిట ఉంది.. ఈ భూమిని పుంగనూరుకు చెందిన వ్యక్తి ఆక్రమించుకుని ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నాడు.. నా తండ్రి మరణిం చాడు.. ఆయన మరణాంతరం నాకు న్యాయంగా చెందాల్సిన 3.14 సెంట్ల భూమిని తిరిగి ఇప్పించండి..

- కె హరినాథ్, మేళందొడ్డి గ్రామం, పుంగనూరు మండలం.

నా భర్తకు చెందాల్సిన భూమి ఇప్పించండి..



నా భర్త పూర్వీకుల ఆస్తి 82 సెంట్లు సాగు భూమి వుంది..అందులో 22 సెంట్ల భూమి నా భర్త బంధు వర్గం వారు ఆక్రమించు కున్నారు.. న్యాయంగా నాభర్తకు చెందాల్సిన భూమిని తిరిగి ఇప్పించండి..

- ఆదిలక్ష్మీ, గబ్బిళ్ళ కోటూరు, పలమనేరు మండలం.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి

వంతెనల పరిశీలనలో కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -విజయపురం, నగరి : నగరి నియోజకవర్గ పరిధిలో లోలెవల్ వంతెనల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపా లని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధి కీళపట్టు మార్గంలో నదీ ప్రవాహంలో కొట్టుకు పోయిన వంతెనను కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే భానుప్రకాష్‌తో పాటు కలిసి పరిశీ లించారు. అనంతరం రోడ్లుభవనాల శాఖ అధికారులతో చర్చించారు. లోతట్టు వంతెనకు మరమ్మతులు చేపట్టి రోడ్డు నిర్మించడానికి అంచనాలు పంపాలని అధికారులను ఆదేశించారు. నదిలో పేరుకు పోయిన పిచ్చిమొక్కల కారణంగా నదినీరు ముందుకుసాగక రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పిచ్చిమొక్కలు తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భవానీశంకరి, తహశీల్దారు రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో సతీష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భానుప్రకాష్‌తో మాట్లాడున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అప్రమత్తంగా వుండాలి

అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి మండలం పెద్దపర్తి కుంట అడవి గ్రామ పరిసరాల్లో సుమారు 10 ఏనుగులు 15వ తేదీ రాత్రి 10 గంటల నుండి 12 గంటల ప్రాంతంలో సంచరిస్తు న్నట్లు, అదే గ్రామానికి చెందిన తాయప్ప టమాటో, వరి సుమారు ఒక ఎకరాను ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయని అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎఫ్‌ఆర్‌ఓ జయశంకర్ హెచ్చరించారు. రాత్రి వేళల్లో అటవీ గ్రామాల సమీప ప్రాంతాలైన సంఘనపల్లి, ఎం కొత్తూరు, బోయినపల్లి, బూరుగులపల్లి, చిన్న గొల్లపల్లి పెద్ద గొల్లపల్లి, బిసానతం గ్రామ ప్రజలు రాత్రి వేళల్లో జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ సిబ్బంది, డిఆర్‌ఓ పుల్లయ్య, బీట్ ఆఫీసర్ రెహమాన్ పాల్గొన్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంటను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

బోర్లు, మోటార్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరవాసుల నీటి సమస్య పరిష్కారం కోసం వివిధ ప్రాంతాల్లో తవ్విన నూతన బోర్లు, మోటార్లను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరపాలక పరిధిలో నీటి సమస్య పరిష్కారం కోసం రూ.1.30 కోట్లతో 22 బోర్లు తవ్వి మోటార్లు బిగించినట్లు చెప్పారు. నగర వాసులు నీటికి ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో బోర్ల తవ్వకానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. నగరవాసుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్పొరేషన్ వీలీనమైన పంచాయతీల అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలో 13వ వార్డు మాపాక్షి, 12వ వార్డు పరిధిలోని రామాపురం, ఎంకే పురం, గంగినేని చెరువు వద్ద, 49వ వార్డు దుర్గా కాలనీలో బోరు, మోటర్లకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. మాపాక్షి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, ఇన్‌చార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు తొమ్మిది వినతులు



వినతులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో తొమ్మిది వినతులు అందాయి. నగర పాలక సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినుతులు స్వీకరించారు. వినతుల పరిష్కారంపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. గతవారం అందిన అర్జీలపైన సమీక్ష నిర్వహించారు. సోమవారం నాటి పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం 3, ఇంజనీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 2, రెవెన్యూ 1 చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం వద్దు..అభివృద్ధిపై దృష్టి సారించండి

పట్టణాభివృద్ధిపై సమీక్షలో అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో అభివృద్ధి అడుగైనా ముందుకు సాగడం లేదని అధికారులు అలసత్వం వీడి అభివృద్ధిపై దృష్టి సాధించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధికారులను ఆదేశించారు. పలమనేరులోని తన కార్యాలయంలో సోమవారం రెవెన్యూ , మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టదలచిన ఎస్‌టిపి ప్లాంటు, టౌన్ హాలు, బస్ షెల్టర్ల ఏర్పాటు, ఆర్వో ప్లాంట్ లు, పైప్ లైన్ పనులు, షాపింగ్ గదుల ఏర్పాటు తదితర పనుల పురోగతిపై ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో అధికారులు ఇచ్చిన వివరణకు ఆయన అసహనం వ్యక్తం చేశారు. పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయని వెంటనే పనులు జరిగేలా చూడాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పట్టణంలో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికలతో నీటి ఎద్దడిని అధిగమించాలని సూచించారు. ప్రధానంగా గంగన్న శిరస్సు ప్రాజెక్టు పనులను పూర్తి చేసుకుంటే పూర్తిస్థాయిలో పట్టణ నీటి సమస్యను అధిగమించేందుకు వీలుంటుందని దానిపై దృష్టి సారించాలన్నారు. పట్టణ శివారులలోని గంటావూరు, గడ్డురు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రధానంగా గంటా ఊరు కాలనీలో ఈ మధ్య కాలంలో చేపట్టిన అక్రమ పట్టాల విచారణలో వెలుగు చూసిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనర్హులను గుర్తించి అర్హులకే స్థలాలు అందేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో తహశీల్దారు ఇన్బనాధన్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టిపి బిఓ ఇందిరా, మున్సిపల్ సర్వేయర్ ఆంజనేయులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అభివృద్ధిని కాంక్షించే వాళ్లంతా కలిసి రండి..

- చిత్తూరులో రోడ్డు విస్తరణ జరగాల్సిందే
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపు

పజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర అభివృద్ధి కోరుకునే వాళ్లు, ఆకాంక్షించే వాళ్లంతా కలిసి రావాలని, రోడ్ల విస్తరణ.. మౌలిక సదుపాయాలు కల్పనతోనే చిత్తూరు నగరం సమగ్ర అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరాన్ని స్మార్ట్ గా అభివృద్ధి చేయడం, రోడ్ల విస్తరణ అంశాలపై సోమవారం సాయంత్రం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ప్రజా సంఘాలు, నగర అభివృద్ధి కమిటీలు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం విజయవంతంగా సాగింది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిత్తూరు నగరాన్ని స్మార్ట్ నగరంగా అభివృద్ధి చేయడం అనే అంశాలపై అన్ని వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. యువత, విద్యార్థులు మాట్లాడుతూ.. చిత్తూరు నగరాన్ని విద్యా పరంగా అభివృద్ధి చేయాలని, యూనివర్సిటీ నెలకొల్పడం ద్వారా విద్యా అవకాశాలను మరింత మెరుగుపరచాలని కోరారు. వైద్యరంగం, మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, ఐటీ కంపెనీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్ల విస్తరణ అంశం గత పది సంవత్సరాలుగా నానుతోందని రోడ్లు అభివృద్ధి చెందితేనే నగరం అభివృద్ధి చెందుతుందని.. ఈ విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధానంగా హై రోడ్డు విస్తరణ అంశంలో కొంతమంది అభివృద్ధికి అడ్డుపడు తున్నారని అయినా ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదన్నారు. హైరోడ్ విస్తరణ కోసం అందరూ కలిసి వచ్చి ఏకగ్రీవంగా తీర్మానం చేస్తే.. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. విస్తరణలో నష్టపోయే వారికి తగిన విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసు కుంటానని చెప్పారు. చెన్నై, బెంగళూరు నగరాల మధ్య ఉన్న చిత్తూరు అభివృద్ధి చెందడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, అయితే కొంత నష్టమైనా ఇప్పుడు అందరూ కలిసికట్టుగా చిత్తూరు నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కలిసి రావాలన్నారు. మురుకంబట్టి నుంచి కలెక్టరేట్ వరకు, పుత్తూరు రోడ్డు వరకు రోడ్లను విస్తరించుకోవడం ద్వారా నగరాన్ని వేగంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. చిత్తూరు నగర అభివృద్ధి కోసం 'స్మార్ట్ చిత్తూర్ డెవలప్‌మెంట్ కమిటీని' ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభివృద్ధి కోసం కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలతో కలిసి ముందుకు సాగుతామన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో అమరావతి రాజధాని కోసం 30 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని.. నేడు ఇదే రాజధాని ప్రాంతాన్ని ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో చిత్తూరు ప్రజలు చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, చుడా ఛైర్ పర్సన్ కె హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, నగర ప్రముఖులు డీకే బద్రి నారాయణ, రావూరి ఈశ్వరరావు, వి. సురేంద్ర కుమార్, చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు, కవిత, సప్తగిరి ప్రసాద్, శోభారాణి, గంటా మోహన్, సిపిఐ, సిపిఎం నాయకులు వాడ గంగరాజు, సురేంద్రన్ బీఎస్పీ పార్టీల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కాలనీ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తాం
చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించండి..


చిత్తూరు స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేస్తున్న కృషిని సిపిఎం అభినందిస్తుందని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తెలిపారు. సోమవారం నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన నగర అభివృద్ధి ఆత్మీయ సమావేశంలో గంగరాజు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా భవనాలు కోల్పోతున్న వారికి చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం, నీవా నది రక్షణ గోడ, నూతన యూనివర్సిటీ ఏర్పాటు, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి తోపాటు మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించాలి.

- వాడ గంగరాజు, సిపిఎం చిత్తూరు జిల్లా కన్వీనర్.

అతివేగం అనర్థం..

- గాలిలో దీపంలా విద్యార్థుల భవిష్యత్తు
- డ్రైవర్లకు చెలగాటం
- నిబంధనలు పాటించని కళాశాలలు, పాఠశాలల బస్సులు

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్: చిత్తూరు నగరంలో ప్రైవేటు విద్యాలయాలు అత్యధికంగా ఉన్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం ఈ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన వందల కొద్దీ బస్సులలో విద్యార్థులతో ప్రయాణిస్తుంటారు. చిత్తూరు నగర పరిసర ప్రాంతాల నుండే కాక చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాది మంది విద్యార్థులు ఈ ప్రైవేటు బస్సుల్లోనే వచ్చి వెళ తుంటారు. అయితే సమయానికి పాఠశాలలో చేరుకోవాలని డ్రైవర్లు నిబంధనలు మరిచి బస్సులు అత్యంత వేగంగా నడుపుతున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద వేగ నియంత్రణల వద్ద స్పీడు నియంత్రించడం లేదు. వాహనాలను ఓవర్ టేక్ చేసే క్రమంలో మరింత వేగంగా బస్సును నడుపుతున్నారు. సమయానికి పాఠశాలకు వెళ్లడం అటు ఉంచితే జరగరాని ప్రమాదం జరిగితే విద్యార్థుల భవిష్యత్తు ఊహించడానికి భయమేసే పరిస్థితి నెలకొంది. ప్రమాద హెచ్చరికలు సైతం లెక్కచేయకుండా మలుపుల వద్ద వేగం తగ్గించకుండా బస్సులు నడపడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటమే. కొంతమంది డ్రైవర్లు సెల్ ఫోన్లు మాట్లాడుతూ బస్సులు నడపడం, ఇయర్ ఫోన్స్ పెట్టుకుని మాట్లాడడం తోటి వాహనదారులు ప్రయాణికులు మోగించే హారన్స్, వారు చెప్పే మాటలు పట్టించుకోకుండా వాహనం నడపడం మరింత ప్రమాదకరంగా మారుతోంది. కొంతమంది డ్రైవర్లు ఫేస్‌బుక్, యూట్యూబ్‌లు, ఇన్‌స్టాగ్రామ్, వీడియో కాల్స్ చూసుకుంటూ నడపడం ఫ్యాషన్‌గా మారింది. ఈపరిస్థితి డ్రైవర్లకు చెలగాటం, విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారుతోంది. దీని వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం వుంది. ఇప్పటికైనా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం, సంబంధిత అధికారులు డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కల్పించాలని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐశివశంకర్

బోయకొండ ఆలయం పరిశీలన

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల బస్టాండ్ సమీపంలోని బోయకొండ అమ్మవారి ఆలయంలో నిన్న ఆదివారం పగలు చోరీ జరిగిన విషయం తెలిసిందే. సోమవారం ఆలయ పూజారి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ శివశంకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలో దాతలు అమ్మవారికి విరాళంగా ఇచ్చిన నాలుగు తాళిబొట్లు(నాలుగు గ్రాములు) చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని సీసీటీవీ ఫుటేజిని పరిశీలిస్తున్నామని తెలిపారు.

ఆధార్లలో ఒకలా..అపార్ ఎలా..?

- సర్వర్ సమస్యలతో ప్రజల ఇక్కట్లు
- ముందుకు సాగని సవరణలు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఆధార్ సవరణకు ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు.. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్టర్) సంఖ్య అందించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. వన్ నేషన్.. వన్ స్టూడెంట్ అనే నినాదంతో కొత్త ప్రక్రియ అమలు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గంటలు తరబడి వేచి వున్నా సర్వర్ సమస్యలతో సవరణలు ముందుకు సాగడంలేదు. దీంతో రోజులు తరబడి ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి -పూతలపట్టు: అపార్‌కు అవసరమైన ఆధార్ సవరణకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారాల తరబడి సచివాలయంలోని ఆధార్ కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గంటల కొద్దీ నిరీక్షిస్తున్నా సవరణ చేయడంలేదు. విద్యార్థుల మార్కుల జాబితా, ఆధార్ కార్డులో తల్లిదండ్రులు విద్యార్థుల ఇంటిపేర్లు , ఇనిషియల్, వయస్సు, గ్రామం, వీధి , వార్డు పేర్లు సక్రమంగా లేకపోతే అపార్ అనుసంధానం జరగదు. వివరాల సవరణ కోసం విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాలకు వరుస కట్టారు. ప్రస్తుతం పూతలపట్టు మండలంలో ఒకే ఆధార్ సవరణ కేంద్రం ఉంది. రోజూ 50కి మించి సవరణలు చేయడంలేదు. జనం తాకిడి అధికంగా ఉండడంతో సిబ్బంది సైతం తలుపులు మూసుకుని పని చేయాల్సి వస్తోంది. ఉదయమే వరుసలో నిలబడి పగలంతా కేంద్రం వద్ద నిరీక్షిస్తున్నా సవరణలు చేయడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ సవరణ కేంద్రాలు మరిన్ని అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆధార్ సవరణ కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆధార్ సవరణలు తప్పనిసరి

ప్రభుత్వం జారీ చేసిన నియమ నిబంధనల ప్రకారం అపార్‌కు ఆధార్‌ను అనుసంధానం చేయడం వల్ల ఆధార్‌లో ఉన్న తప్పొప్పులను సవరణ చేసుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం అన్ని ఆన్‌లైన్ కావడంతో చిన్న సమస్య ఉన్నా ఆన్‌లైను కావడం లేదు. దీంతో పిల్లల తల్లిదండ్రులను పిలిపించి ఆధార్‌లోని సమస్యలను వివరించి సవరణ చేసుకోమని వివరిస్తున్నాం.. ఆధార్ కేంద్రాలు తగినన్ని లేని కారణంగా సవరణలు ఆలస్యం అవుతోంది. దీంతో విద్యాశాఖకూ ఇబ్బందికరంగా మారింది.

- మధు, ఎంఈఓ, పూతలపట్టు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -పూతలపట్టు : ప్రజలు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు గుర్రప్ప కోరారు. పూతలపట్టు మండలంలోని వాల్ తోటలో నిర్వహించిన గ్రామసభలో సోమవారం తహశీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఇతర సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపితే వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. పూతలపట్టు మండలంలో దీర్ఘకాలిక భూ సమస్యలు అధికంగా ఉన్నాయని శ్మశాన వాటికలకు సంబంధించి అనేక మంది వినతులు అందిస్తున్నారని వాటికి తక్షణం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ మురళి, వీఆర్వో మునెయ్య పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ జాతర


ఆకట్టుకుంటున్న యువకుల వివిధ వేషధారణలు


ప్రజాశక్తి - కార్వేటినగరం: బంగారమ్మ అమ్మవారి జాతర వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామున బంగారమ్మ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, పాలు, పెరుగు, పసుపు, చందనం, తేనే, నారికేళి జలాలతో అభిషేకించారు. అనంతరం పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పొంగళ్ల వండి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యువత వివిధ వేషధారణలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గ్రామ పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారి సారె గ్రామ వీధుల్లో ఊరేగించి సమర్పించుకున్నారు. బంగారమ్మ ఆలయం వద్ద నుంచి గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. దీంతో గ్రామంలో ఆదివారం నుంచి జాతర వేడుకల సంబరాలు సంతరించుకుంది.

పేదరిక నిర్మూలనే లక్ష్యం: ఎంపీడీవో

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించ డమే లక్ష్యమని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం గంగాధరనెల్లూరు హైస్కూల్లో కార్యాచరణ ప్రణాళికా 2024-25 స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి అంశాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పేదరికాన్ని తొలగింపు లక్ష్యాలను సాధించడానికి ఐక్యరాజ్య సమితి చేసిన ప్రయత్నమే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలన్నారు. మనం ఆరోగ్యంగా, సంతోషంగా, సురక్షితంగా జీవించాలంటే సుస్థిర అభివృద్ధి చాలా ముఖ్యమని తెలిపారు. పేదరికం, ఆకలి, వ్యాధులు, అసమానతలు వంటి ప్రపంచ సమస్యలకు సుస్థిర అభివృద్ధి మాత్రమే శాశ్వత పరిష్కారమన్నారు. సిహెచ్ఓ శ్రీనివాసులు, పిఆర్పి ఈ సుగుణాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి శివయ్య పలువురు అధికారులు సర్పంచులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడివో హరిప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న సాగునీటి సంఘం సభ్యులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సాగునీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షులతో పాటు సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. రెండు రోజుల క్రితం పలమనేరు నియోజక వర్గంలోని అన్ని మండలా లలో సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహించి అన్నిచోట్ల ఏకగ్రీవం అయిన విషయం తెలిసిందే. దీంతో గంగవరం, పెద్దపంజాణి మండలాల్లోని పలు సంఘాలతో పాటు పలమనేరు పట్టణ సాగునీటి సంఘ సభ్యులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని వారికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపంజాణి మండల మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, బైరెడ్డిపల్లి, వీ కోట, గంగవరం, పెద్దపంజాణి, పలమనేరు పట్టణ టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ, రంగనాథ్, సోమశేఖర్ గౌడ్, ఆనంద్, ఆర్‌బిసి కుట్టితోపాటు నాయకులు మురహరి రెడ్డి, శ్రీరాములు, గిరిబాబు, నాగరాజు, ఖాజా చాంద్ బాషా, మదన్, శ్రీధర్ ఉన్నారు.

సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - సదుం : పంచాయతీ అభివృద్ధి లక్ష్యాల పై స్థానిక సర్పంచులకు, సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్య దర్శులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల శిక్షణను సంబంధిత అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. సోమ, మంగళవారం రెండు రోజులు శిక్షణలో భాగంగా స్థానిక గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ పై పంచాయతీ వ్యవస్థ పై, విద్యాభివృద్ధి పై, బాలికల విద్యను ప్రోత్సహించడం, ఆరోగ్య సదుపాయాల గురించి, తాగునీటి సరఫరా, శుభ్రత పథకాలు, వ్యాధుల నియంత్రణకు చర్యలు, మహిళా శక్తీకరణ పథకాలు, పేదరిక నిర్మూలన, కల్పన, గృహ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ, సాగునీటి ప్రాజెక్టులు, తదితర అంశాలపై ఉన్నతాధికారులు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదుం ఎంపీడీవో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హరిబాబు, ఏ ఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఆదినారాయణ, ఏఈపిఆర్‌సి రాజ్, వెలుగు ఏపీఎం హరిప్రసాద్, చెరుకు వారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఆఫీసర్ ఉదయ భాస్కర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేణు తెలిపారు. సోమవారం శిక్షణలో భాగంగా మొదటి రోజు స్థానిక ఎంపిడివో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 9 లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. స్థానికీకరణ సుస్థిరత అభివృద్ధి 9 అంశాలపై ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, ఏఈపీఆర్ ఇన్‌ఛార్జి వెంకటేష్ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడివో కే వేణు, ఈవోపీఆర్డి, సుకుమార్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణి , ఐసిడిఎస్ సూపరువైజరు సరళ కుమారి, ఏపిఎం ఈశ్వరి, ఎంపిహెచ్ఎ లక్ష్మీపతి, ఏఈపిఆర్ ఇన్‌ఛార్జి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఐరాల: పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక లో అందరూ భాగస్వాములు కావాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కి కృషి చేయాలని చిత్తూరు డిఎల్‌పిఓ పార్వతీ కోరారు. సోమవారం ఐరాల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం జాతీయ అవార్డు పొందిన బొమ్మ సముద్రం పంచాయతీ సర్పంచ్ రఘు ని సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ధనలక్ష్మి మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై రెండు రోజుల మండల శిక్షణలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి కావాల్సిన పనులను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గుర్తించి, ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. విస్తరణాధికారి కుసుమ కుమారి జిపిడిపి తయారీలో ఉన్న శిక్షణా అంశాలను వివరించారు. ఈటీసీ కాళహస్తి ప్రిన్సిపల్ నాగ పద్మజ శిక్షణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, మండలంలోని సర్పంచులు, ఎంపిటీసి లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : సర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధి పై రెండు రోజులు శిక్షణలో భాగంగా మొదటిరోజు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారని ఎంపీడీవో మోహన్ మురళి తెలిపారు .

దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

చిన్న కొరివివారిపల్లి గ్రామస్తుల వినతి


గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రాలు అందిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కల్లూరుపల్లి పంచాయతీ చిన్న కొరివివారిపల్లి గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కల్లూరుపల్లి పంచాయతీ చిన్న కొరివివారిపల్లిలో ప్రభుత్వ భూమి వుందని వాటిలో గ్రామంలో నివసిస్తున్న దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన అగ్రవర్ణాల ఆధీనంలో ఉంచుకున్నారని దీన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమిని అర్హులైన దళితులైన తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వారు కోరారు. గజరాజులు దాడిలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అధికం చేయాలని, ఏనుగుల దాడుల నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాగిమాను పెంట రైతులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ, దివ్య, రెడ్డమ్మ, సరస్వతి, శిరీష, సంధ్యారాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

అర్జీదారుల పట్ల మర్యాదగా మెలగాలి: కమిషనర్


మాట్లాడుతున్న కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు తీసుకు వచ్చే ప్రజల పట్ల ప్రభుత్వ ఉద్యోగులు మర్యాదగా మెలగాలని కుప్పం పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము ఆధ్వర్యంలో కమిషనర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా పరిష్కార వేదికపై అర్జీదారుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి అర్జీదారుని సమస్యలు సానుకూలంగా విని, ఆర్థికపరమైనవి కాని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని, ఆర్థికపరమైన సమస్యలను మాత్రమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించామని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు చిన్నచిన్న సమస్యలపై ప్రజలు ముఖ్యమంత్రిని కలిసే అవసరం లేకుండా ఉద్యోగులు పనిచేయాలని తెలిపారు. జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారని, ఈ సందర్భంగా ప్రజలు అభివృద్ధిపై మాత్రమే ఆయనకు అర్జీలు అందించాలని, చిన్న చిన్న సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసే అవసరం లేకుండా సచివాలయ సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సోము, సురేష్, జగదీష్, శివ, టిడిపి నాయకులు ఎం ఆర్ సురేష్, పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బంది, పాలక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరం ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు పనులను చిత్తూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, చిత్తూరు గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ పురం మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఈ నెల 18వ తేదీ నిర్వహించే ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధుల ప్రత్యేక శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రత్యేక అసెస్మెంట్ క్యాంపునకు ఎస్ఆర్ పురం ,కార్వేటినగరం ,వెదురుకుప్పం, పాలసముద్రం, గంగాధర నెల్లూరు మండలాల వయోవృద్ధులు దివ్యాంగులు అసెస్మెంట్ క్యాంపు నందు పాల్గొని వారికి కావలసిన చేతి కర్రలు వాకర్లు, చంక కర్రలు వీలు చైర్లు వినికిడి యంత్రాలు బ్యాటరీ సైకిల్ మూడు చక్రాల సైకిల్ కుష్టు వ్యాధిగ్రస్తులకు లెప్రసీ కీట్లు, కృతిమ అవయాలు మొదలైన వివిధ రకములైన ఉపకరణాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రత్యేక ప్రతిభావంతులు ఆధార్ కార్డు, ఆధార్ కార్డు సదరం వైద్య ధ్రువీకరణ పత్రం ,రేషన్ కార్డ్ లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం ,నాలుగు ఫొటోలు మొబైల్ నెంబర్ అన్ని ధ్రువపత్రాలను రెండు సెట్లు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్ తహశీల్దారు లోకనాథ పిల్లై ఎస్ఆర్ పురం హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని చోడవరం సమీపంలోని స్వర్ణముఖినదిలో ఆదివారం గల్లంతైన పాఠశాల విద్యార్థి లక్ష్మీధర్ (14)మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన సురేష్, షర్మిల దంపతుల రెండవ కుమారుడు లక్ష్మీధర్ శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులు నలుగురితో కలిసి చోడవరం సమీపంలో స్వర్ణముఖి నదిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. స్నేహితులు ఒడ్డుపైనే ఉండగా లక్ష్మీధర్ ఈతకు దిగి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గల్లంతయ్యాడు. బాలుడితో పాటు ఉన్న స్నేహితులు ఇచ్చిన సమాచారంతో ప్రవాహంలో కొట్టుకుపోయిన బాలుడి ఆచూకీ కోసం సీఐ తిమ్మయ్య, ఎస్సై ఈశ్వరయ్య, అగ్నిమాపక సిబ్బందితో పాటు స్థానికులు భారీగా చేరుకుని రెండు రోజుల పాటు తీవ్రంగా గాలించారు. కాగా గల్లంతైన ప్రాంతం నుంచి అర్ధ కిలో మీటరు దూరంలో పొదల మధ్య చిక్కుకున్న బాలుడి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. స్నేహితులతో సరదాగా గడిపేందుకు వెళ్లిన లక్ష్మీధర్ తిరిగి మృతదేహమై రావడంతో కుటుంబీకులతో పాటు గ్రామంలో పెను విషాదాన్ని నింపింది. కాగా బాలుడి ఆచూకీలో సీఐ తిమ్మయ్య చూపిన చొరవపై సర్వత్రా ప్రశంసలు కురిపించారు. గజ ఈత గాళ్లతో సమానంగా ఆయన నదిలో దూకి బాలుడు మృత దేహాన్ని కనుగొన్నారు.

కరాటేలో ప్రతిభకు బెల్టులు

ప్రజాశక్తి -విజయపురం, నగరి : కరాటే టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ చూపి వివిధ బెల్టులు పొందిన వారికి సోమవారం బెల్టులు ప్రదానం చేశారు. ఆర్కే స్పోర్ట్స్ కరాటే అకాడమీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఐ మహేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 35 మందికి ఎల్లో బెల్టులు, 25 మందికి ఆరెంజ్ బెల్టులు, 12 మందికి బ్లూ బెల్టులు, 18 మందికి గ్రీన్ బెల్టులు, ఏడుగురికి బ్రౌన్ బెల్టులు, 9 మందికి బ్లాక్ బెల్టులు వాటితో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆత్మరక్షణ కళ అయిన కరాటేను నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరమని ఈ సందర్భంగా సీఐ తెలిపారు.

సమన్వయంతోనే సమస్యలకు పరిష్కారం: ఎంపిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ కోరారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ నిర్మలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్నా అందించలేదని వాపోయారు. తద్వారా పంటలు ఎండబెట్టుకునే పరిస్థితి కల్పించవద్దని ఆశాఖ అధికారులను పలువురు నిలదీశారు. గ్రామ సచివాలయాల్లో డిజిటల్ కార్యదర్శులు ధృవపత్రాల కోసం వెళ్లిన వారిని లంచాలు ఇవ్వాలని వేధిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ నిధులతో వరవ కాలువల అభివృద్ధి కోసం మండలంలో రూ. కోట్లలో పనులు చేపట్టినట్లుగా నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడిస్తున్నారని, చేసిన పనులు ఏ ప్రాంతంలో చేశారో చూపాలని ఆశాఖ అధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. పేదల సొంతింటి కల నెరవేర్చే విధంగా వారికున్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇచ్చే దిశగా రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి కోరారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు గెరటారెడ్డి, మల్లికమ్మ, ఎంపీడీవో సురేంద్రనాథ్, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్'ను సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ అనిల్ కుమార్


వైద్య సేవలు అందిస్తున్న డాక్టరు అనిల్‌కుమార్ నాయక్

ప్రజాశక్తి -యాదమరి: 'ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ ఫిజిషియన్'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపు నిచ్చారు. సోమవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొటాల గ్రామంలో 104 డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రతినెలా మూడవ సోమవారం గ్రామానికి 104 సంచార వైద్య వాహనంతో పాటు వైద్యాధికారి వైద్య సిబ్బంది హాజరవుతామని చిన్న చిన్న జబ్బులకు ఇక్కడే పరీక్షలు చేసి అవసరమైన మందులు కూడా అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎలాంటి ఖర్చు లేకుండా వారికి అవసరమైన వైద్యం ఉచితంగా అందించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించిందని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపు నిచ్చారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతినెలా కొటాల గ్రామ పరిధిలోని గర్భిణులను సైతం ఈ వాహనం వద్దకు తీసుకువచ్చి వారికి అవసరమైన అర్హత పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారని ప్రతి ఒక్క గర్భిణి హాజరు కావాలని సూచించారు. 14 రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా చేస్తామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, హెల్త్ సూపరువైజర్లు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడికి ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మామిడి పంట బీమాకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ ఉపసంచాలకులు మధుసూదన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని, జిల్లా లో మామిడి పంటకు వాతావరణం ఆధారిత బీమా పథకం వర్తింపజేశారని తెలిపారు. మామిడి పంట వేసుకున్న రైతులు ఎకరాకు రూ.1750 ప్రీమియం చెల్లించి భీమా చేసుకోవాలని మామిడి పంట కు నష్టం జరిగితే ఎకరాకు రూ. 35 వేలు వరకు బీమా మొత్తాన్ని అందజేస్తుందని తెలిపారు. 2024 డిసెంబరు 1 వ తేది నుండి 2025 మే నెల 31 వరకు మధ్యకాలంలో వచ్చే అనుకూల వాతావరణ పరిస్థితులకు సంబంధించి మామిడి పంటకు నష్టం జరిగితే బీమా పొందవచ్చునని తెలిపారు. మామిడి పంట బీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, ఈ పంట చేసుకున్న వారు గత సంవత్సరంలో కానీ, ఇంతవరకు ఈ పంట బుకింగ్ చేసుకోక పోయినా ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ పంట బుకింగ్ తప్పనిసరిగా చేసుకొని ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. మామిడి రైతులు అందరూ ఇప్పటికే ఈ పంట నమోదు చేసుకుని వుంటే వెంటనే ఆర్‌బికే ఇన్‌ఛార్జిలను కలిసి పంట నమోదు చేసుకోవాలని, వెంటనే మామిడికి ఇన్స్యూరెన్స్ కూడా చేసుకోవచ్చునని తెలిపారు. తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లాలోని మామిడి రైతులకు సూచించారు.

ఎస్‌సి వర్గీకరణ అమలు కావాలి: ఎంఆర్‌పిఎస్


మాట్లాడుతున్న కుప్పం ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలని, దళిత సోదరులే వర్గీకరణకు అడ్డుపడడం భావ్యం కాదని ఎంఆర్‌పిఎస్ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, కుప్పం పట్టణ అధ్యక్షులు మురుగేష్‌లు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కుల సభ్యులతో కుప్పం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్డ్ క్యాస్ట్‌లో వున్న 59 ఉపకులాకు రాజ్యాంగంలోని రిజర్వేషన్ సమానంగా అందాలన్న ఉద్దేశంతో మంద కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన వెంట దేశంలోని మాదిగ కులస్తులు గత మూడు దశాబ్దాలుగా పోరాటం చేశామన్నారు. మాదిగల ఆవేదనను గుర్తించిన దేశ అత్యున్నత న్యాయ స్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. ఈ తీర్పును అనుసరించి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎస్సీ ఉప కులాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ ద్వారానే సాధ్య మన్నారు. ఈ విషయాన్ని గుర్తించి దళిత సోదరులు వర్గీకరణకు సహకరించాలని వారు కోరారు.

క్రైం న్యూస్

35 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -కార్వేటినగరం: అక్రమంగా తరలిస్తున్న 35 మద్యం బాటిళ్లను స్వాధీ నం చేసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ మండల పరిధిలోని కత్తెరపల్లి ఏఏడబ్ల్యూకు చెందిన డి బాబు తమిళనాడు నుంచి ఆదివారం రాత్రి 11 గంటలకు టీవీఎస్ ఎక్స్ వాహనంలో అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్నాడని అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి అతని వద్ద ఉన్న 35 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి నోటీసు ఇచ్చి పంపామని ఎస్ఐ పేర్కొన్నారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా బెల్టుషాపులు నిర్వహిస్తూ అక్రమార్జనకు పాల్పడు తున్నట్లు తెలసిన వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించి నేరాలను తగ్గించేందుకు కృషి చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : టాటా ఏస్ వ్యాన్ స్కూటర్‌ని ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం ఎస్ఆర్ పురం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఎస్ఆర్ పురం మండలంలోని చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి బసిరెడ్డిపల్లి కాలనీ వద్ద యుయం పురం గ్రామానికి చెందిన ఆనగల్లి శీను కుమారుడు ప్రభాకర్ (50) కొత్తపల్లి మిట్ట బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకొని తిరిగి ద్విచక్ర వాహనం మీద స్వగ్రామమైన యుయం పురానికి వస్తుండగా ఎదురుగా చిత్తూరుకు టాటా ఏస్‌వ్యాన్ డ్రైవర్ అతివేగంగా దూసుకొచ్చి స్కూటరును ఢీకొని పక్కనే ఉన్న 33 కె విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఆర్ పురం పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రభాకర్ మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి రూరల్ మండలం పాడిపేటలో సోమవారం దారుణం చోటు చేసుకుంది. బంగారం కోసం దుండగులు ఓ వృద్ధురాలి గొంతు నులిమి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. కమ్మలు, గాజులు, మెడలో ఉన్న చెయిన్‌తో పాటు బీరువాలోని బంగారాన్ని సైతం దోపిడీ చేసి పారిపోయారు. మృతురాలిని జీవరత్నమ్మ (70)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అడిషనల్ ఎస్పీ, క్రైం డీఎస్పీ వివరాలు సేకరించారు.

ఏనుగు దాడిలో లేగ దూడ మృతి


ఏనుగు దాడిలో మృతి చెందిన ఏనుగు

ప్రజాశక్తి -గంగవరం: ఏనుగు దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన మండలం లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ బండమీద జరా వారి పల్లి గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు గ్రామస్తులను భయ భ్రాంతులకు గురిచేసింది. గ్రామ పొలిమేరలో వుంటున్న రైతు వెంకటరమణ ఇంటిని గత వారం పూర్తిగా ధ్వంసం చేసింది. అదే రైతు కొట్టంలో కట్టేసి వున్న పశువులపై దాడి చేసి కొట్టాన్ని ధ్వంసం చేసి లేగ దూడను చంపేసింది. ఇది గమనించిన మిగతా పశువులు తాళ్లను తెంచుకొని పరుగులు తీశాయని రైతు వాపోయాడు. ఇటీవల కాలంలో అప్పుడప్పుడూ ఈ ప్రాంతంలో ఏనుగులు వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఏనుగుల బారీ నుండి తమ గ్రామాన్ని రక్షించాలని కోరుతున్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం: ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపిడివో నారాయణ

ప్రజాశక్తి -సోమల: పంచాయతీల పరిధిలోని గ్రామాలు పరిశుభ్రమైన స్వచ్ఛమైన గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యం గా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శు లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించాలని ఎంపీడీవో నారాయణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు మందిరంలో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన రెండు రోజుల శిక్షణలో మొదటి రోజు పలు అంశాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామాలు, బాలహిత పంచాయతీలు, నీటి సమృద్ధి గ్రామాలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలపై విచారణ

ప్రజాశక్తి -రొంపిచర్ల : రొంపిచర్ల మండలం బండ కింద పల్లి లో ఈనెల 6న నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామ ప్రజలు ఇచ్చిన భూ ఫిర్యాదులపై సోమవారం రొంపిచర్ల మండలం తహశీల్దారు పి కిరణ్ కుమార్ విచారణ చేపట్టారు. ప్రతి అర్జీలకు, మ్యుటేషన్‌కు సంబంధించిన ఆన్‌లైను సమస్యలు తక్షణమే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సుధాకర్ నాయక్, బండకింద పల్లి సర్పంచ్ ఎస్ అన్సర్ బాష, వెలుగు సర్వేయర్ రమణ పాల్గొన్నారు.

18న విశ్రాంత ఉద్యోగుల రజతోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -విజయపురం నగరి : ఈ నెల 18వ తేదీన స్థానిక పెన్షనర్స్ భవనంలో విశ్రాంత ఉద్యోగుల రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు జయచంద్రుడు, ప్రధాన కార్యదర్శి ఓ. బాలసుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఈ వేడుకలకు తప్పక హాజరు కావాలన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు..

ప్రజాశక్తి-గుడిపల్లి: సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు అని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని చిన్న గొల్లపల్లి గ్రామ పంచాయతీలో రెవెన్యూ సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మాట్లాడుతూ సమస్యలకు పరిష్కారం రెవెన్యూ సదస్సు అని, ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని రైతులు రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్ చంద్రశేఖర్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛారి హేమాంబర గౌడు, స్థానిక టిడిపి నాయకులు , మాజీ సర్పంచ్ డీకే చంద్ర, నాయకులు అరుణాచలం, మనీ, కోడెప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా చిత్తూరు జిల్లా ,సదుం మండలం, నడిగడ్డ గ్రామం నందు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయము కలదు(రఘుపతి చెరువుకు దక్షిణం వైపు) సదరు దేవాలయమును దేవాదాయ శాఖ నందు సెక్షన్ 43 ప్రకారం రిజిష్టర్ చేయ దలిచాము. ఇందుకు ఏదైనా అభ్యంతరాలు ఉన్న ఎడెల సహాయ కమీషనర్, దేవాదాయ శాఖ,చిత్తూరు వారి కార్యాలయము నందు 15 రోజులలోపు తెలియజేయగరు.

ఆలయ కమిటీ,
నడిగడ్డ గ్రామం,కురవ పల్లి

పాకాల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.NO. 428 / 2023, O.S. NO. 256/2023

యం. జయరామయ్య ....పిటిషనర్లు

Vs

పి. ధనంజయ వగైరా ....ప్రతివాదులు

2,3 ప్రతివాదులకు నోటీసు

To. (2) యం.వి.నిరంజన్, S/o లేట్ యం.వి.కేశవ రెడ్డి, (3) యం. వి. శ్రీధర్, S/o లేట్ యం.వి.కేశవ రెడ్డి, డోర్ నెం. 24-133-శ్రీనగర్ కాలనీ, కొంగారెడ్డిపల్లె, చిత్తూరు టౌన్.

పై కేసునందు వాది మీపై ఇంజక్షన్ ఆర్డరు కోరి పై పిటిషను వేసియున్నారు. మీకు అభ్యంతరములు వున్న తేది.06-01-2025 న 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై అభ్యంతరాలు తెలుపుకొనవసినది.

(కోర్టు వారి ఉత్తర్వు)

ఇట్లు,
జి. గురుస్వామి నాయుడు,
అడ్వకేటు, పాకాల.

పాకాల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. NO. 256/2023

యం. జయరామయ్య ....వాది

Vs

పి. ధనంజయ వగైరా ....ప్రతివాదులు

2,3 ప్రతివాదులకు కోర్టు నోటీసులు

To. (2) యం.వి.నిరంజన్, S/o లేట్ యం.వి.కేశవ రెడ్డి, (3) యం.వి.శ్రీధర్, S/o లేట్ యం.వి.కేశవ రెడ్డి, డోర్ నెం. 24-133-శ్రీనగర్ కాలనీ, కొంగారెడ్డిపల్లె, చిత్తూరు టౌన్.

పై కేసునందు వాది మీపై పైన తెలిపిన దావా వేసి డిక్రీ కోరియున్నారు. కావున మీ ఇరువురికి ఏవిధమైన అభ్యంతరము యున్నయెడల తేది.06-01-2025 న 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై అభ్యంతరాలు తెలుపుకోవచ్చును. లేనియెడల కేసు వాదికి అనుకూలము కాబడును.

(కోర్టు వారి ఉత్తర్వు)

ఇట్లు,
జి. గురుస్వామి నాయుడు,
అడ్వకేటు, పాకాల.

డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మాణం


టి చంద్రమ్మ , సర్పంచ్

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండల కేంద్రం వివేకానగరులో ఐదు లక్షల 25 వేల రూపాయలతో నూతన సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామని సర్పంచ్ టి చంద్రమ్మ తెలిపారు. సోమవారం సర్పంచ్ చంద్రమ్మ విలేకరులతో మాట్లాడుతూ ఒక మహిళా సర్పంచ్‌గా తనపై నమ్మకంతో ప్రజలు తనను ఎన్నుకున్నందుకు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని పేర్కొన్నారు. మండలంలో గంగవరం మేజర్ పంచాయతీ కావడంతో ఈ పంచాయతీలో 16 గ్రామాలు ఉన్నాయని, ఈ పంచాయతీలో అధిక జనాభా వుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వీధిలైట్లు తదితర ముఖ్యమైన సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు పూర్తి చేస్తున్నామని దీంతో పాటు ప్రతి గ్రామంలోనూ ఎప్పటికప్పుడు పారిశుధ్యకార్యక్రమాలను చేపట్టి తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగును సకాలంలో వేయడంతో గ్రామాల్లో ఎలాంటి సమస్యలూ లేకుండా ముందుకు వెళుతున్నామని ఇందుకు ఈ పంచాయతీలో కార్యదర్శులు సైతం తమకు సహకరిం చడంతో పనులు సజావుగా సాగుతున్నా యన్నారు. ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అందరికీ అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయడమే తన భాగ్యమని పేర్కొన్నారు. గతంలో డ్రైనేజీ వేగవంతంగా లేకపోవడంతో డ్రైనేజ్ పనులు అస్తవ్యస్తంగా మారాయని దీన్ని దృష్టిలో వుంచుకుని నూతనంగా నిర్మించామని పేర్కొన్నారు.


గతంలో వున్న డ్రైనేజీలు


ప్రస్తుతం నిర్మిస్తున్న డ్రైనేజీలు